ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
శనివారం 27 జనవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980
నల్లగొండ :18004251442
యాదాద్రి :1800 425 7106
సూర్యాపేట :1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.109	158	180
సూర్యాపేట	రూ.135	173	200
నల్లగొండ	రూ.119	173	196

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 । కనిష్ఠం 19.2

సమగ్రాభివృద్ధే ధ్యేయం

● కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ● జిల్లాకేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు

సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 26: జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్నామని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ ప్రసంగించారు. జాతిపిత మహాత్మాగాంధీ, పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ, సర్దార్ వల్లాభాయ్ పటేల్, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ లాంటి నేతలతోపాటు మరెందరో త్యాగధనుల కృషి, పోరాట త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. మనల్ని మనం పరిపాలించుకునే సర్వసత్తాక ప్రజాస్వామ్య, సామ్యవాద, లౌకిక వ్యవస్థ పునాదిగా అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగంతో 1950 జనవరి 26న మనదేశం గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించిందన్నారు. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అర్హులైన వారికి అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టగా వాటి లక్ష్యాలను పూర్తి చేస్తున్నామని వివరించారు. జిల్లాలో కొత్త ప్రభుత్వంలో ప్రజాపాలన పారదర్శకంగా, సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలన్నదే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమన్నారు.

ఆరు గ్యారెంటీల అమలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీల్లో ఆరు గ్యారెంటీలను అమలుచేస్తోందని, ఇందులో ఒకటి మహాలక్ష్మి, రెండోది రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలు గతేడాది డిసెంబరు 9వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయని కలెక్టర్ చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు 21,32,860 మంది ప్రయాణికులు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ఉపయోగించుకున్నారని వివరించారు. రాష్ట్రంలోని పేదలందరికీ ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలనే గొప్ప ఉద్దేశ్యంతో రాజీవ్‌ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం రూ.5లక్షలు ఉన్న వైద్య సాయాన్ని రూ.10లక్షలకు పెంచినట్లు తెలిపారు. జిల్లాలో గతేడాది డిసెంబరు 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన ద్వారా ప్రజల నుంచి సంక్షేమ పథకాలను దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు. అందులో భాగంగా జిల్లాలోని 475 గ్రామపంచాయతీలు, ఐదు మునిసిపాలిటీల్లో వార్డుసభల ద్వారా 3,76,419 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఆ దరఖాస్తులను 1330 ఉద్యోగులతో ఆన్‌లైన్ చేయించినట్లు తెలిపారు.

సీఎం నాయకత్వంలో సరి కొత్త అధ్యాయం

సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధితో ప్రపంచంతో పోటీపడేలా సంక్షేమంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించాలనే పట్టుదలతో ఉందని కలెక్టర్ వెంకట్రావ్ అన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పన, నైపుణ్యాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌తోపాటు రైతు భరోసా పథకంలో భాగంగా యాసంగిలో జిల్లాలోని మొత్తం 2,93,689 మంది రైతులకు రూ.317.46కోట్లను కేటాయించినట్లు చెప్పారు. ఇప్పటివరకు 1.79లక్షల రైతుల ఖాతాల్లో రూ.96.76కోట్లను జమ చేసినట్లు వివరించారు. రైతుల రూ.2లక్షల రుణమాఫీ ప్రక్రియకు సంబంధించి బ్యాంకులతో సంప్రదింపులు జరుగుతున్నాయని స్పష్టంచేశారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే బీకే, అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, వెంకటరెడ్డి, ట్రైనీ ఐపీఎస్ రాజేష్‌మినా, అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు, డీఎస్పీ పరిక నాగభూషణంతోపాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జెండావిష్కరణ

గణతంత్ర వేడుకల సందర్భంగా జిల్లా పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను కలెక్టర్ వెంకట్రావ్ ఎగురవేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్‌శాఖలోని వివిధ విభాగాల పోలీసులు మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. ఏఆర్, సివిల్, హోంగార్డులు, ఎన్‌సీసీ విభాగాలకు చెందిన సిబ్బంది మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

గణతంత్ర వేడుకల సందర్భంగా పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జిల్లాలోని భవిత జూనియర్ కళాశాల, ఇమాంపేట వద్ద గల తెలంగాణ మోడల్ స్కూల్, నడిగూడం మండలం సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలెంల వద్ద గల తెలంగాణ రాష్ట్ర మహిళా డిగ్రీ కళాశాల, జిల్లాకేంద్రంలోని బాలికల గిరిజన హాస్టల్, మఠంపల్లిలోని ఎంసీఎల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి.

స్టాళ్ల పరిశీలన

వేడుకల్లో భాగంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్‌హెగ్డే బీకే, అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకటరెడ్డి, ట్రైనీ ఐపీఎస్ రాజేష్‌మినా, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతోపాటు వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. ఆయా శాఖలకు సంబంధించి స్టాళ్లలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా వాటి ప్రాముఖ్యం గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

లబ్ధిదారులకు రుణాల పంపిణీ

గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 216 స్వయం సహాయక సంఘాలకు మెప్మా ఆధ్వర్యంలో రూ.9.16కోట్లు, భానుపురి జిల్లా మహిళా సమాఖ్యలోని 7931 సంఘాలకు రూ.508.97కోట్లు, 2750 సంఘాలకు రూ.90.59కోట్ల విలువైన బ్యాంకు రుణాలను పంపిణీ చేశారు. అదే విధంగా జిల్లాలోని ప్రభుత్వ శాఖలకు సంబంధించి ప్రతిభచాటిన పలువురు జిల్లా స్థాయి అధికారులతోపాటు ఉద్యోగులు, సిబ్బందికి కలెక్టర్ ఎస్. వెంకట్రావ్, ఎస్పీ రాహుల్‌హెగ్డే బీకే ప్రశంసాపత్రాలు అందజేశారు.

స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం

జిల్లాలోని పలువురు స్వాతంత్ర్య సమర యోధులను గణతంత్ర వేడుకల సందర్భంగా ఘనంగా సన్మానించారు. శాదం వెంకటరెడ్డి, గుడిపాటి అంజయ్య, బండ పుల్లారెడ్డి, టంగుటూరి కోటయ్యలను కలెక్టర్, ఎస్పీ పూలమాలలు, శాలువాలు, మెమోంటోలతో సన్మానించారు.



జిల్లాకేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకలనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



జిల్లాకేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఎగురవేస్తున్న కలెక్టర్ వెంకట్రావ్, పక్కన ఎస్పీ రాహుల్ హెగ్డే



జెండాకు వందనం చేస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక



ప్రత్యేక వాహనంపై కలెక్టర్ వెంకట్రావ్

జిల్లాకేంద్రంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

పల్లెలో విరిసిన పద్మం కూరెళ్ల

● ఇంటిని గ్రంథాలయంగా మార్చిన ఘనుడికి కేంద్రం సత్కారం
● పద్మశ్రీ ప్రకటనతో జిల్లావ్యాప్తంగా సంబురాలు



గ్రామీణ ప్రాంతంలో పుట్టిన బిడ్డ.. దేశం గర్వించే స్థాయికి ఎదుగుతాడని ఎవ్వరూ ఊహించి ఉండరు.. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అనడానికి ఆయన సాక్ష్యంగా నిలిచారు. రామన్నపేట మండలం మారుమూల గ్రామమైన నీర్నేములలో పుట్టి, ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పే అధ్యాపకుడయ్యారు. తెలుగులో ఎన్నో మధుర కవితలు, పద్యాలు రాశారు. లెక్కలేనన్ని వేదికలపై సాహిత్య ఉపన్యాసాలు చేశారు. తన సొంత ఇంటినే గ్రంథాలయంగా మార్చి రెండు లక్షల పుస్తకాలను సమకూర్చి, దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు పొందారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్వయంగా చూసిన ఆయన ఆ పోరాటంపై పుస్తకం రాశారు. తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో మమేకమయ్యారు. ప్రస్తుతం దేశం గుర్తించదగ్గ పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆయనే రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన అభినవ పోతన, మధురకవిగా పిలుచుకునే డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య. పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన సందర్భంగా ప్రత్యేక కథనం..

7

బంజారాలకు దక్కిన గౌరవం

● గిరిజన పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దేవసోతు రీకంరాథోడ్

కేతావత్ సోమ్‌లాల్‌ను కేంద్ర ప్రభుత్వం పద్మ శ్రీ అవార్డుకు ఎంపిక చేయడం బంజారాలకు అందరికి గౌరవంగా ఉందని గిరిజన పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దేవసోతు రీకం రాథోడ్ అన్నారు. సోమ్‌లాల్‌ను హైదరాబాద్‌లో సన్మానించి మాట్లాడారు.



కేతావత్ సోమ్‌లాల్(మధ్యలో)

7

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే మందుల సామేల్



నకార విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సామేల్

తుంగతుర్తి, జనవరి 26: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో పెన్షనర్ల పితామహుడు డీఎస్. నకార విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తుంగతుర్తిలో రూ.25లక్షలు వెచ్చించి విశ్రాంత ఉద్యోగుల కోసం భవనాన్ని నిర్మించిన సంకినేని కుటుంబ సభ్యులను ఎన్నడూ మరిచిపోకూడదన్నారు. కార్యక్రమంలో పాలవర సంతోష్, సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ సంకినేని స్వరూప, రవీందర్‌రావు, దొంగరి గోవర్ధన్, కిషన్ బాబు, సత్యనారాయణ, పులుసు పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల గ్యాస్ సిలిండర్ లీకై మృతి చెందిన మండలంలోని ఏనెకుంటతండాకు చెందిన బానోత్ అమ్మ, జోష్న కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మందుల సామేల్ పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకుడు గోవర్ధన్, కిషన్‌రావు, సత్యనారాయణ, రాంబాబు ఉన్నారు.

బత్తాయి సాగు కష్టమే

● పడిపోతున్న కాయల ధర ● తెగుళ్ల వ్యాప్తి.. పెరిగిన పెట్టుబడులు ● ప్రతికూల వాతావరణంతో రైతుల్లో ఆందోళన

ఉమ్మడి నల్లగొండ జిల్లా రెండు దశాబ్దాల క్రితం 2లక్షల ఎకరాల్లో బత్తాయి సాగుతో ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉండేది. ప్రస్తుతం 30వేల ఎకరాల సాగు మాత్రమే మిగిలి అంతరించే దశకు చేరింది. వాతావరణ మార్పులతో తెగుళ్ల వ్యాప్తి, దిగుబడులు లేకపోవడం, ధరలు పడిపోవడం వంటి కారణాలు బత్తాయి సాగు తగ్గిపోవడానికి ప్రధానంగా కన్పిస్తున్నాయి.

● త్రిపురారం

బత్తాయిలో వేసవిలో (మార్చి నుంచి మే వరకు) వచ్చే కత్తెర కాయకు మంచి డిమాండ్ ఉంటుంది. ఈ సమయంలో ఉత్తరాదిన బత్తాయికి అధిక డిమాండ్ ఉంటుంది. టన్నుకు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు ధర పలుకుతుంది. ఈ సంవత్సరం మాత్రం ఆశించిన స్థాయిలో కత్తెర దిగుబడులు రాలేదు. సాధారణంగా అక్టోబరులో బత్తాయి వాడుకు ఇచ్చి (బహర్ పద్ధతి) నీటిని కట్టడం ద్వారా ఈ కాయవస్తుంది. అదే సమయంలో వర్షాలు పడటంతో బత్తాయి వాడుకు రాలేదు. దాంతో రైతులకు ఆశించిన మేర దిగుబడులు రాలేదు. సాధారణంగా 30 నుంచి 40శాతం మేర కత్తెర దిగుబడులు వస్తాయి. ప్రస్తుతం 10 నుంచి 15 శాతం మించి రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పసుపు పచ్చగా మారిన బత్తాయి

సీజన్ కాయకు గండం

ఈ ఏడాది సీజన్ కాయ (జనవరి) ఆశించిన మేరకు వచ్చిన మంచు కురవడం, చలి వాతావరణంవల్ల బఠాణి గింజ సైజుతోపాటు చిన్న నిమ్మకాయ సైజు వరకు విపరీతంగా రాలిపోతుంది. ఎన్ని సస్య రక్షణ చర్యలు చేపట్టినా ఆశించిన ప్రయోజనం ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 50 శాతం మించి కాయ నిలబడేది కష్టమేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఈ కాయ దిగుబడి జూన్‌నుంచి సెప్టెంబరు వరకు కోతకు వస్తుంది. నాలుగేళ్లుగా ఈ కాయలకు టన్నుకు రూ.10వేల నుంచి రూ.20వేలకు మించి ధర పలకకపోవడంతో నష్టాలు తప్పవని, కనీసం పెట్టుబడులు రావని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బత్తాయికి తెగుళ్ల తాకిడి

దశాబ్ద కాలంగా బత్తాయికి తెగుళ్ల తాకిడి అధికమయింది. తేమతో కూడిన వాతావరణంలో ఉండటంతో వేరుకుళ్లు, ఎర్ర నల్లి, నల్ల నల్లి, పల్లాకు తెగులు వ్యాప్తిస్తుండటంతో బత్తాయి సాగు వేగంగా తగ్గిపోతుంది. చాలా మంది రైతులు ప్రత్యామ్నాయ సాగు వైపు మొగ్గుచూపుతున్నారు. బత్తాయి ఎకరాకు 10 టన్నుల వరకు దిగుబడి రావాల్సి ఉండగా 3 నుంచి 4 టన్నులు రాకపోవడంతో నష్టపోతున్నారు. బత్తాయికి పెట్టుబడులు భారీగా పెరిగాయి. పశువుల ఎరువులు, అడుగు పిండి, క్రిమి సంహారక మందుల ధరలు ఐదేళ్లలో నాలుగింతలు పెరగడంతో ఒకప్పుడు ఎకరా సాగుకు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు పెట్టుబడి వస్తుండగా ప్రస్తుతం రూ.70వేల వరకు వెచ్చించాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. దిగుబడులు బాగా తగ్గిపోవడం, కాయ ధర లేక పోవడంతో ఎకరానికి రూ.40వేలకు మించి రావడం లేదని, కనీసం పెట్టుబడులు రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే బత్తాయి సాగుకు ఉద్యావన శాఖ నుంచి కనీస ప్రోత్సాహం ఉండటం లేదు.

ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలి



వాతావరణ మార్పులతో బత్తాయికి తెగుళ్ల ఆశించి దిగుబడులపై ప్రభావం పడుతుంది. ఎరువులు, పురుగు మందుల ధరలు భారీగా పెరగడంతో పెట్టుబడులు భారీగా పెరిగాయి. నాలుగేళ్లుగా బత్తాయికి ధరలు పడిపోయాయి. ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు తీసుకోవాలి.

అనుముల లింగారెడ్డి, రైతు, త్రిపురారం



గంధాన్ని ఎత్తుకొని తీసుకొస్తున్న నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వైభవంగా గంధం ఊరేగింపు

పాలకవీడు, జనవరి 26: మండలంలోని జాన్‌పహాడ్ దర్గా వద్ద శుక్రవారం గంధం ఊరేగింపు వైభవంగా సాగింది. సందల్‌ఖానా నుంచి గంధం బిందెలను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఎత్తుకొని వచ్చారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం దర్గా వద్దకు ఊరేగింపు తీసుకొని వెళ్లి హజ్రత్‌సయ్యద్ మోహినుద్దీన్‌షా, జాన్‌పాక్ షహీద్ రహమతుల్లా సమాధులపై ఎక్కించారు. ఈ కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

•6లో..

జాన్‌పహాడ్‌లో వైభవంగా గంధం ఊరేగింపు

- జాన్‌పహాడ్ ఉర్సుకు రెండోరోజూ తరలివచ్చిన ప్రజలు
- గంధం ఊరేగింపులో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పాలకవీడు, జనవరి 26 : సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ సైదులు దర్గా ఉర్సులో భాగంగా రెండరోజైన శుక్రవారం గంధం ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి తెచ్చిన గంధాన్ని ముజావర్ జానీ చందల్‌ఖానాలో ఉంచారు. ఆ గంధాన్ని ప్రత్యేకంగా అలంకరించిన గుర్రంపై ఊరేగించారు. గంధం బిందెలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎత్తుకొని దర్గాలోని చందల్‌ఖానాకు తీసుకువచ్చారు. అనంతరం జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం గంధాన్ని కల్మెటతండా, జాన్‌పహాడ్, చెర్వుతండా గ్రామాల్లో ఊరేగించారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకటరావు, ఎస్పీ రాహుల్ హెగ్డేలు దర్గాలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో భక్తులు గురువారం రాత్రి నుంచే దర్గాకు చేరుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. ఊరేగింపు అనంతరం దర్గాలోని హజ్రత్‌సయ్యద్ మోహినుద్దీన్‌షా, జాన్‌పాక్ షహీద్ రహమతుల్లా సమాధులపైకి ఎక్కించారు. ఆ సమయంలో భక్తులను దర్గాలోకి అనుమతించలేదు. తొక్కిసలాట జరుగకుండా పోలీసులను పెద్దసంఖ్యలో మోహరించడంతో పాటు బారికేడ్లు ఏర్పాటు చేయడంతో దర్శనాలు సాఫీగా సాగాయి. రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా, గుంటూరు, ఒంగోలు, ప్రకాశం జిల్లాల నుంచి లక్షకు పైగా భక్తులు తరలివచ్చినట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు. ఇదిలా ఉండగా కృష్ణానది ఆవల ఉన్న గ్రామాల్లోని భక్తులు పెద్దసంఖ్యలో కృష్ణానదిలో పుట్టిపై ప్రయాణించి దర్గాకు చేరుకున్నారు. గంధం అందుకునే క్రమంలో స్వల్పగాయాలైన భక్తులకు వైద్య సేవలు అందించారు. గురువారం సాయంత్రం నుంచే భక్తుల రద్దీతో దర్గా ప్రాంతం రద్దీగా మారింది. ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, సీఐలు రామలింగారెడ్డి, రవి, పాలకవీడు ఎస్‌ఐలు లింగయ్యతో పాటు నేరేడుచర్ల, మఠంపల్లి, గరిడేపల్లి, హుజూర్‌నగర్ ఎస్‌ఐలు, స్థానిక తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో వెంకటాచారిలతో పాటు 450మంది పోలీస్ సిబ్బంది భక్తులకు సేవలందించారు.


గంధం తీసుకువచ్చే సమయంలో దర్గా వద్ద భక్తుల సందడి


పూజల్లో పాల్గొన్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


పార్కింగ్ స్థలంలో భారీసంఖ్యలో వాహనాలు


విద్యుద్దీపాల కాంతుల మధ్య దర్గా ప్రాంతం

నేత్రపర్వంగా ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ

యాదగిరిగుట్ట, జనవరి 26: యాదగిరీశుడి సన్నిధిలో శుక్రవారం స్వామికి సువర్ణ పుష్పార్చనలు, ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు నిత్యపూజలు ఆరంభించి గర్భగుడిలోని సువర్ణ ప్రతిష్ఠా అలంకార కవచమూర్తులను 108 బంగారు పుష్పాలతో అర్చించారు. గర్భాలయంలోని స్వయంభువులను వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి, తులసీదళాలు, కుంకుమతో సహస్రనామార్చనలు జరిపారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో హోమం, నిత్యతిరుకల్యాణం ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. కొండపైన అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరుడికి, నిత్యార్చనలు, రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. సాయంత్రం వేళ ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి ఊంజల్ సేవలో తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనుబంధ ఆలయమైన పాతగుట్ట లక్ష్మీనృసింహుడి ఆలయ సన్నిధిలో స్వామికి సువర్ణ పుష్పార్చనలు, ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. 25వేల మంది భక్తులు నృసింహుడిని దర్శించుకోగా, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.33,56,345 ఆదాయం సమకూరింది.


అద్దాల మండపంలో ఆండాళ్ అమ్మవారికి హారతి నివేదిస్తున్న అర్చకులు

పాలస్తీనా జాతీయ జెండాల ప్రదర్శన

- నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో కలకలం

మిర్యాలగూడ అర్బన్, జనవరి 26 : గణతంత్ర దినోత్సవం సందర్భంగా నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో నలుగురు యువకులు పాలస్తీనా దేశ జాతీయ జెండాలను ప్రదర్శించటం తీవ్ర చర్చనీయాంశమైంది. సీఐ రాఘవేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని ఓ డిగ్రీ కళాశాల సమీపంలోని షాపింగ్‌మాల్ వద్ద నలుగురు యువకులు రెండు పాలస్తీనా జాతీయ జెండాలను పట్టుకుని ప్రదర్శిస్తుండగా, మరో యువకుడు వారిని వీడియోలో చిత్రీకరిస్తున్నాడు. దీనిని గమనించిన రోడ్డుపై వెళ్తున్న కొందరు యువకులు పాలస్తీనా జెండాలను పట్టుకున్న యువకులను వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. సోషల్‌మీడియాలో యువకుల వీడియో వైరల్ అవుతుండటంతో పోలీసులకు సమాచారం అందింది. వెంటనే డీఎస్పీ వెంకటగిరి స్పందించి వన్‌టౌన్ సీఐ రాఘవేందర్‌ను అప్రమత్తం చేశారు. సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని యువకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి విచారించినట్లు సీఐ తెలిపారు. సోషల్ మీడియా రీల్స్ చిత్రీకరణలో భాగంగా సదరు యువకులు పాలస్తీనా దేశ జాతీయజెండాలను ప్రదర్శించామని నిందితులు తమవిచారణలో చెప్పినట్లు సీఐ వివరించారు. సున్నితమైన అంశం కావడంతో యువకుల వివరాలు వెల్లడించేందుకు సీఐ నిరాకరించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు. ఇదిలా ఉండగా గణతంత్ర వేడుకలను శాంతియుతంగా జరుపుకుంటున్న సందర్భంలో పాలస్తీనా జాతీయ జెండాలను ప్రదర్శించడం అత్యంత హేయమైన చర్య అని బీజేపీ పట్టణ కార్యదర్శి శ్యామ్ అన్నారు. ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించిన వారిని చట్టబద్ధంగా శిక్షించాలని వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కాగా సుమారు అరగంటకు పైగా పాలస్తీనా జెండాలతో యువకులు నిలబడ్డారు. ప్రస్తుతం పోలీసుల అదుపులోనే నలుగురు యువకులు ఉన్నారు.


మిర్యాలగూడ పట్టణంలో పాలస్తీనా జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న యువకులు, వీడియోలో చిత్రీకరిస్తున్న మరొకరు

పల్లెలో విరిసిన పద్మం 'కూరెళ్ల'

పల్లెటూరి కవి, విమర్శకుడు, విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేసిన కూరెళ్ల విఠలాచార్యకు అరుదైన గౌరవం దక్కింది. ఆయన కృషిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ అవార్డును ప్రకటించింది. సొంత ఇంటినే గ్రంథాలయంగా మార్చి సమాజానికి, ముఖ్యంగా గ్రామీణ యువతకు విజ్ఞానాన్ని అందిస్తున్న ఆయన 2021 డిసెంబరు 6న మన్‌కీబాత్‌లో ప్రధాని మోదీ ప్రశంసలు అందుకోగా, ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా పద్మశ్రీ పురస్కారం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం

● మోత్కూరు





- ● పద్మశ్రీతో విఠలాచార్యను సత్కరించనున్న కేంద్ర ప్రభుత్వం
- ● సచ్చే లోపు...సంతకమైనా నేర్చుకో అన్నది ఆయన నినాదం
- ● ఇంట్లోనే అతి పెద్దగ్రంథాలయం ● కవి, విమర్శకుడుగా ప్రఖ్యాతి

రామన్నపేట మండలం నీర్నేముల గ్రామంలోని అమ్మమ్మ ఇంట్లో జన్మించిన కూరెళ్ల విఠలాచార్య విద్యార్థి దశ నుంచే కవితలు రాశారు. వెల్లంకి స్వగ్రామం కాగా, ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా రామన్నపేట మండలం మునిపంపులలో 1959లో చేరారు. 1960లో యాదగిరిగుట్ట మండలం వడాయిగూడెం పాఠశాలకు బదిలీ అయ్యారు. ఆ గ్రామస్థులు తమ పిల్లలను పాఠశాలకు పంపేవారు కాదు. దాంతో పిల్లల తల్లిదండ్రులకే చదువు నేర్పాలన్న సంకల్పంతో 'సచ్చేలోపు... సంతకమైనా నేర్చుకో'.. అన్న నినాదంతో ఆయన వారికి పలకలు కొనిచ్చి తల్లిదండ్రులకు చదువు నేర్పించారు. వారి పిల్లలను బడికి పంపేలా కృషి చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో తెలుగు భాషాభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారు.

కలం నుంచి 25 రచనలు

కూరెళ్ల విఠలాచార్య ఇప్పటివరకు 25 రచనలు చేయగా అందులో 22 ముద్రితమయ్యాయి. మిగిలిన మూడు పుస్తకాలు ముద్రించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆయన రచనల్లో విఠలేశ్వర శతకం, శిల్పాచార్యులు. తెలుగు నవలల్లో స్వాతంత్రోద్యమ చిత్రణ(పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథం), తెలుగులో గొలుసు కట్టు నవలలు(ఎంఫిల్ సిద్ధాంత గ్రంథం) పుస్తకాలు ఆయనకు బాగా పేరు తెచ్చాయి. వీటితో పాటు స్వాతంత్రోద్యమం-ఆంధ్రప్రదేశ్‌లోని దాని స్వరూపం, మధురకవి కూరెళ్ల పీఠికలు, స్మృత్యంజలి, కవితాచందనం, తెలంగాణ కాగడాలు-సీస మాలిక, కూరెళ్ల వ్యాసాలు, మా ఊరి వెలుగు, కవిరాజు ఏలె ఎల్లయ్య, చద్దిమూటలు, దొందూ దొందే, సింగి-సింగడు(నాటిక), మన కథ(బుర్ర కథ), హైదరాబాద్ సంస్థానం-నల్లగొండ జిల్లాలో రజాకార్ల దురంతాలు, కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్, వంద శీర్షికలు, వంద సీసాలు, తెలంగాణోద్యమ కవితలు, కూరెళ్ల నానీలు, గోవిలాపం పుస్తకాలను రచించి ముద్రించారు. మరో మూడు పుస్తకాలు ముద్రించాల్సి ఉంది.

వరించిన పురస్కారాలు

విఠలాచార్య పలు పురస్కారాలను అందుకున్నారు. వాస్తు శిల్పి బీఎన్.రెడ్డి, ప్రజాకవి సుద్దాల హన్మంతు, 1979 నల్లగొండ జిల్లా ఉత్తమ ప్రధానాచార్య, రాష్ట్రోపాధ్యాయ సంఘం వారిచే నల్లగొండ స్వర్ణోత్సవ, నల్లగొండ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల చేత 'ఆచార్య' బిరుదు, 2019లో దాశరథి పురస్కారం. ఇప్పుడు పద్మశ్రీ వీటితో పాటు 35కు పైగా ఆయన వివిధ సంస్థల నుంచి అవార్డులు, 10 సంస్థల నుంచి జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు.

బయోడేటా

పేరు : కూరెళ్ల విఠలాచార్య
కలం పేరు : కూరెళ్ల
జననం : 9 జూలై 1938
తల్లిదండ్రులు : లక్ష్మమ్మ, వెంకటరాజయ్య
భార్య : యమున
స్వగ్రామం : వెల్లంకి, రామన్నపేట మండలం,యాదాద్రి జిల్లా
విద్యార్హతలు : ఎంఏ (తెలుగు), బీఈడీ, ఎంఫిల్, పీహెచ్‌డీ, విశారద(హిందీ)

అభిలాష

పఠనం, పరిశోధన, రచన, సాహిత్య, సాంస్కృతిక, విద్య, ఆధ్యాత్మిక, సామాజిక సేవాకార్యక్రమాలు, నిర్వహణ, పల్లెల్లో విద్య, సాహిత్యవ్యాప్తి.

అందుకున్న అవార్డులు

అభినవ పోతన, మధుర కవి, సుధీతిలక, సాహిత్యబ్రహ్మ, ఆచార్య, తెలంగాణ వేమన, నల్లగొండ కాళోజీ, అక్షరకళా సామ్రాట్, కవితాశ్రీ, కవిభూషణ, సాహిత్య ప్రపూర్ణ, మధుర కవితా కళానిధి.

నిర్వహించిన పత్రికలు

బాపూ భారతి, మా తెలుగు తల్లి, పల్లెవెలుగు, మన పురోగమనం, చిరంజీవి, ప్రియంవద, ముచికుంద, లేఖిని.

కూరెళ్ల ప్రోత్సాహంతో...

వెల్లంకిలో సత్యగాయత్రీ ఆశ్రమం, ఆచార్య కూరెళ్ల ఫౌండేషన్, బతుకమ్మ తల్లి కళాబృందం, ఆచార్య కూరెళ్ల గ్రంథాలయం, శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి భజనమండలి,అరుంధతి సేవా సంస్థ, పూర్వ విద్యార్థుల సమితి, మోత్కూరులో ప్రజాభారతి, నల్లగొండలో మిత్రభారతి, వలిగొండ కళాభారతి, చౌటుప్పల్‌లో అక్షర కళాభారతి,రామన్నపేటలో చైతన్య కళాస్రవంతి, సాహితీ స్నేహితులు, స్పందన, ఆత్మీయులు, బాల భాతి, యాదాద్రిభువనగిరి జిల్లా రచయితల సంఘం లాంటి సాహితీ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంస్థల ఏర్పాటులో కీలకపాత్ర పోషిస్తూ వాటి ద్వారా సాహిత్య, కళాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

అంకిత గ్రంథాలు

ఏనుగు నర్సింహారెడ్డి కావ్యం 'నేనే', డా.జనువాడ రామస్వామి 'వేకువ రేఖలు, రాజదండం', పెండెం జగదీశ్వర్ 'ఆంధ్ర ప్రదేశ్ జానపద కథలు' బండ్ల కృష్ణ' కృష్ణ గీతాలు, బొడ్డు వెంకటేష్ 'అష్టపదులు', గంజి నర్సింహ 'ముచికుంద మరియు ప్రేమ శతకం', దాసోజు జ్ఞానేశ్వర్ 'రణగీతం' ఆయనకు అంకితమిచ్చారు.



వెల్లంకిలోని విఠలాచార్య ఇంట్లోని గ్రంథాలయం

కూరెళ్ల ఇతివృత్తంగా గ్రంథాలు

కూరెళ్లాన్వయ విఠలా(శతకం), కూరెళ్ల వారి జీవన రేఖలు(పద్యకావ్యం), సాహితీమూర్తి కూరెళ్ల, కూరెళ్ల జీవితం(పద్యకావ్యం), కూర్మిసరం, కవితల్లో కూరెళ్ల ఇతివృత్తంగా ప్రముఖులు పుస్తకాలు రాశారు. డాక్టర్ కూరెళ్ల వ్యక్తిత్వం-సాహిత్యంపై డాక్టర్ నాగపురి శ్రీనివాసులు, విఠలాచార్య విఠలేశ్వర శతకం-ఒక పరిశీలన అనే అంశంపై మల్లిఖార్జున్ పరిశోధక గ్రంథాలు రాశారు.

ఇల్లే గ్రంథాలయం

విఠలాచార్య చదువుకునే సమయంలో పుస్తకాలు కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత లేక ఇబ్బందిపడ్డారు. తోటి విద్యార్థులు పగలు చదువుకున్నాక రాత్రి పడుకునే సమయంలో వారి వద్ద నుంచి పుస్తకాలు తీసుకుని రాత్రి చదివి ఉదయం తిరిగి ఇచ్చేవారు. నాడు భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట లాంటి పట్టణాల్లో తప్ప గ్రంథాలయాలు అందుబాటులో ఉండేవికావు. పుస్తకాల కోసం ఎంతో ఇబ్బంది పడ్డ ఆయన గ్రామీణ విద్యార్థులు, యువకులు, పరిశోధకులకు అందుబాటులో ఉండేలా గ్రామీణ ప్రాంతంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో వెల్లంకిలో స్థలం అడగ్గా ఎవరూ ఇవ్వలేదు. దీంతో తన సొంత ఇంట్లోనే గ్రంథాలయం ఏర్పాటు చేసి ఇంటిని సాహిత్య కుటీరంగా మార్చారు. తనకున్న ఆరు ఎకరాల భూమి పేదల ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వానికి ఇచ్చి, ఆ భూమికి ప్రభుత్వం ఇచ్చిన రూ.2 లక్షలను గ్రంథాలయానికి వెచ్చించారు. ఇంట్లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని 13 ఫిబ్రవరి 2014న అప్పటి నల్లగొండ జిల్లా కలెక్టర్ చిరంజీవులు ప్రారంభించారు. ఆనాడు 5 వేల పుస్తకాలతో ప్రారంభమైన గ్రంథాలయం నేడు రెండు లక్షల పుస్తకాలతో రాష్ట్రంలో అతిపెద్ద గ్రామీణ గ్రంథాలయంగా నిలిచింది. 550చదరపు గజాల తన ఇంటి స్థలంలో సుమారు 200 బీరువాలు పట్టేలా, ఎక్కువ మంది కూర్చొని చదువుకునేలా విశాలమైన భవనం నిర్మించారు. ఆ భవనాన్ని ఫిబ్రవరిలో గవర్నర్ చేత ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల గవర్నర్ తమిళిసైని కలిసి గ్రంథాలయ ప్రారంభానికి సమయం ఇవ్వాల్సిందిగా కోరారు. గ్రంథాలయానికి ఎక్కువ పుస్తకాలు సేకరించేందుకు గాను 'గ్రంథ భిక్ష' పేరుతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో తన శిష్యుల్లో జిల్లాకు ఒకరిని బాధ్యులుగా నిర్ణయించి, వారి ద్వారా దాతల నుంచి పుస్తకాలు సేకరించారు.

కూరెళ్లకు పలువురి సన్మానం

రామన్నపేట, జనవరి 26: కేంద్రం ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడంతో డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యను సీపీఎం నాయకులు ఘనంగా సన్మానించారు. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకిలో విఠలాచార్యను కలిసి శాలువాతో సత్కరించారు. అదేవిధంగా పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అభినందనలు తెలిపారు. ఆయా కార్యక్రమంలో మేక అశోక్‌రెడ్డి, కూరెళ్ల నరసింహచారి, జెల్లల పెంటయ్య పాల్గొన్నారు. వెల్లంకి సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి విఠలాచార్యను గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, గ్రామ వార్డు సభ్యులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



విఠలాచార్యను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు, సీపీఎం నాయకులు

బంజారాలకు దక్కిన గౌరవం

భువనగిరి రూరల్, జనవరి 26 : కేతావత్ సోమ్‌లాల్‌ను కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేయడం బంజారాలకు దక్కిన గౌరవమని గిరిజన పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దేవసోతు తీకం రాథోడ్, ప్రజాగాయకుడు భిక్షునాయక్ అన్నారు. సోమ్‌లాల్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం ఆకుతోటబావి గ్రామానికి చెందిన సోమ్‌లాల్ 30 ఏళ్ల కిందట తండాను విడిచి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఎస్‌బీఐలో డిప్యూటీ మేనేజరుగా విధులు నిర్వహిస్తూ ఐదేళ్ల కిందట వీఆర్ఎస్ తీసుకొని బంజారా జాతిని జాగృతం చేసేందుకు సమారు 200లకు పైగా పాటలు రాశారన్నారు. 1988లో భగవద్గీతను బంజారా భాషలోకి అనువాదం మొదలు పెట్టి 16 నెలల కృషితో పూర్తి చేశారని, 1989 నాటికే 701 శ్లోకాలతో భగవద్గీత అనువాదం పూర్తయినా అచ్చుకావడానికి ఆయన 25ఏళ్లు నిరీక్షించాల్సి వచ్చిందన్నారు. ఎన్నో ఒడిదుడుకుల తర్వాత బంజారా భగవద్గీతను టీటీడీ దేవస్థానానికి అందజేయగా 2014లో ప్రచురితం చేసిందన్నారు.



సోమ్‌లాల్‌ను సన్మానిస్తున్న గిరిజన సంఘ ప్రతినిధి

సోమ్‌లాల్‌ను ఆహ్వానించిన గవర్నర్ తమిళిసై, సీఎంవో అధికారుల అభినందన

పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన సోమ్‌లాల్‌ను రాజ్‌భవన్‌కు రావాలని గవర్నర్ తమిళిసై ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం రాజ్‌భవన్‌కు ఆయన వెళ్లి గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను గవర్నర్ అభినందించారు. అదేవిధంగా సీఎం కార్యాలయ అధికారులు కూడా ఫోన్ చేసి అభినందనలు తెలిపినట్లు సోమ్‌లాల్ తెలిపారు.

అటవీశాఖ సెక్షన్ అధికారి శేఖర్‌రెడ్డి సస్పెన్షన్

చిట్యాల రూరల్, జనవరి 26 : బొగ్గును తరలిస్తున్న లారీకి అక్రమంగా అనుమతులు జారీ చేయడంతో నల్లగొండ జిల్లా చిట్యాల అటవీ శాఖ సెక్షన్ అధికారి వై శేఖర్‌రెడ్డి సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు అటవీ శాఖ యాదాద్రి సర్కిల్ కన్జర్వేటర్ శివానీ డోగ్ర ఈ నెల 25న ఉత్తర్వులను జారీ చేశారు. కట్టంగూరు నుంచి ఈ నెల 13వ తేదీన లారీల్లో బొగ్గును ఎగుమతి చేసుకుని అనుమతుల్లేకుండా రెండు లారీలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్తున్నాయి. మార్గమధ్యలో ఆ లారీలను సూర్యాపేట జిల్లా మోతె మండలం రాయకుంటతండా వద్ద అటవీశాఖ అధికారులు నిలిపి పరిశీలించారు. బొగ్గును తరలిస్తున్నట్లుగా గుర్తించారు. అనుమతి పత్రాలను లోడును తరలిస్తున్న వ్యక్తులను ప్రశ్నించగా తమ వద్ద లేవని సమాధానమిచ్చారు. దీంతో ఆయా లారీలను జప్తు చేశారు. ఈ విషయాన్ని డ్రైవర్లు యజమానికి తెలిపారు. ఆయన ఈ నెల 15న చిట్యాల సెక్షన్ అధికారి వై.శేఖర్‌రెడ్డిని సంప్రదించి ఈ నెల 13 నుంచి కట్టంగూరులో రెండు లారీల్లో బొగ్గును నింపుతున్నారని నమ్మబలికి ఎగుమతికి రవాణా చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. లారీలను పట్టుబడిన విషయం తెలియక ఎప్పటిలాగే వచ్చే వ్యక్తులే కదా అని సెక్షన్ అధికారి శేఖర్‌రెడ్డి ఎలాంటి పరిశీలన చేయకుండానే ఈ నెల 15న తేదీన అనుమతులిచ్చారు. లారీల యజమాని రవాణాకు అనుమతించిన పత్రాలను మోతెలో జప్తు చేసిన అధికారులకు అందజేశాడు. వాటిని పరిశీలించిన అధికారులు నివ్వెరపోయారు. 13న లారీలు పట్టుబడితే 15న ఎగుమతి రవాణాకు సంబంధించిన అనుమతు ఇవ్వడాన్ని తీవ్రంగా పరిగణించారు. సెక్షన్ అధికారి తప్పుగా అనుమతులు ఇచ్చారని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. పరిశీలించిన సర్కిల్ కన్జర్వేటర్ శివానీ విధుల్లో నిర్లక్ష్యం వహించిన శేఖర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



వై శేఖర్‌రెడ్డి

విద్యుదాఘాతంతో మార్లగడ్డ ఉపసర్పంచ్ మృతి


నిడమనూరు, జనవరి 26 : నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం మార్లగడ్డ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గోడితి శ్రీనివాస్(53) విద్యుదాఘాతంతో మృతి చెందారు. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం మార్లగడ్డ పంచాయతీ పరిధిలోని మార్లగడ్డక్యాంపునకు చెందిన శ్రీనివాస్ సాయంత్రం 4 గంటల ప్రాంతంలో తన ఇంటి పక్కనే ఉన్న వ్యవసాయ పొలంలో బోరు మోటారుకు కనెక్షన్ ఇచ్చేందుకు పెద్దకుమారుడు కిరణ్‌తో కలిసి వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వైరు లాగుతుండగా ప్రమాదవశాత్తు సర్వీస్ వైరు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో శ్రీనివాస్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. పక్కనే ఉన్న కుమారుడు తండ్రిని కాపాడే ప్రయత్నం చేయగా అతడి చేతులకు కూడా గాయాలయ్యాయి. గమనించిన శ్రీనివాస్ భార్య కేకలు వేయడంతో గ్రామస్థులు హుటాహుటిన కారులో మిర్యాలగూడలోని ఆస్పత్రికి తరలిస్తుండగా శ్రీనివాస్ మార్గమధ్యలో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సమాచారం అందిన పోలీసులు మృతదేహాన్ని పంచనామా చేసి పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పతికి పంపించారు. కుమారుడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు. శ్రీనివాస్ మృతితో కుటుంబసభ్యులు విలపిస్తున్నారు. విద్యుదాఘాతంతో ఉపసర్పంచ్ మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది.



శ్రీనివాస్(ఫైల్)

ఆటో పల్టీ ఘటనలో వృద్ధుడు..

నార్కట్‌పల్లి, జనవరి 26 : ఆటో పల్టీ కొట్టిన ఘటనలో వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ నర్సిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లి మండలం మాండ్ర గ్రామానికి చెందిన దొండ యాదయ్య(76) మండలంలోని గోపలాయపల్లి లో ఉండే కుమార్తె ఇంటికి వెళ్లాడు. తిరిగి నార్కట్‌పల్లికి వచ్చే క్రమంలో ఆటో ఎక్కాడు. నార్కట్‌పల్లి శివారులోని లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆఫీస్ వద్దకు చేరుకోగానే అదుపుతప్పిన ఆటో డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో యాదయ్యకు తీవ్రగాయాలు కాగా 108 అంబులెన్స్‌లో కామినేని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. యాదయ్య పెద్ద కుమార్తె రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.



యాదయ్య(ఫైల్)

వ్యర్థ రసాయనాల ట్యాంకర్ పట్టివేత

భూదాన్‌పోచంపల్లి, జనవరి 26 : వ్యర్థ రసాయనాలను మూసీ నదిలో వ్యర్థాలను పారబోస్తుండగా యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పూర్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటనపై ఎస్ఐ విక్రంరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గస్తీలో తిరుగుతున్న పోలీసుల వాహనంలో కానిస్టేబుల్ శ్రీనివాస్, వినోద్‌కుమార్ కొత్తగూడెం వెళ్లి తిరిగి పోచంపల్లికి వస్తున్న క్రమంలో మూసీ కాల్వ వద్ద ఆగి ఉన్న ట్యాంకర్ వాహనాన్ని చూశారు. దగ్గరికి వెళ్లి చూడగా వ్యర్థ రసాయనాలను కాల్వలోకి వదులుతున్నట్లు గుర్తించి డ్రైవర్‌ను ప్రశ్నించారు. అయితే ఆ సమయంలో అతడు వారిపై ఎదురు తిరగడానికి ప్రయత్నించాడు. ఈ సమయంలో అతడు పారిపోవడానికి ప్రయత్నించగా అటుగా వెళ్తున్న స్థానికులు పోలీసు వాహనాలు ఆగి ఉన్నాయని చూడటానికి అక్కడికి చేరుకున్నారు. సంఘటనా స్థలానికి వచ్చిన స్థానికుల సహాయంతో నిందితుడు వివేక్‌యాదవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంఘటనపై ఎస్ఐ విక్రంరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. హైదరాబాద్‌లోని కంపెనీల వ్యర్థాలను డబ్బులకు ఆశపడి మూసీనదిలో కలిపి కలుషితం చేస్తున్నారని, దీనిపై ఆధారపడిన వ్యవసాయదారులు, మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జోరుగా.. హుషారుగా

● యాదగిరిగుట్టలో ఉత్సాహంగా గుర్రపు ప్రయాణం ● ఆసక్తి చూపుతున్న యాదగిరీశుడి భక్తులు



పాతగుట్టలో భక్తులను చేరవేసేందుకు సిద్ధంగా ఉన్న జట్కాబండ్లు



గుర్రపు జట్కాలో ప్రయాణం చేస్తున్న భక్తులు

యాదగిరిగుట్టకు వచ్చే భక్తులకు గుర్రపు జట్కాప్రయాణం ఉల్లాసం.. ఉత్సాహాన్ని కలిగిస్తోంది. నాడు పొట్టకూటికోసం కట్టిన బండ్లు ప్రస్తుతం భక్తులకు ఆనందాన్నిస్తున్నాయి. ఆటోలు, కార్లు, బస్సులు రవాణా సాధనాలుగా ఉన్న నేటి కాలంలో పాత కాలం నాటి జట్కాబండిపై ప్రయాణం ఆసక్తిని కలిగిస్తోంది. దశాబ్దం క్రితం వరకు ప్రయాణానికి విరివిగా వినియోగించిన గుర్రపు జట్కాబండ్లు ప్రస్తుతం కనుమరుగయ్యే దశకు చేరుకున్నాయి. అయితే 60 ఏళ్లుగా యాదగిరిగుట్టలో ఉన్న గుర్రపు బండ్ల యజమానులు మాత్రం ఈ ఆధారాన్నే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు.

● యాదగిరిగుట్ట రూరల్

యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో గతంలో భక్తులకు జట్కా బండి రవాణా సాధనంగా ఉండేది. భువనగిరి మండలం రాయిగిరి రైల్వేస్టేషన్ నుంచి యాదగిరిగుట్టకు భక్తుల రాకపోకలకు జట్కాలు ఉపయోగించేవారు. 100 జట్కాబండ్లు రాయిగిరి నుంచి గుట్టతోపాటు, పాతగుట్టకు భక్తులను చేరవేసేవి. గతంలో ఎటు చూసినా జట్కా బండ్లు కనిపించేవి. కాలక్రమేణా ఆధునిక రవాణా వ్యవస్థ అభివృద్ధి చెందడంతో జట్కాబండి అరుదైన రవాణా సాధనంగా మారింది. అయితే గుట్ట ప్రాంతంలో గుర్రపు బండ్ల యజమానుల ఇప్పటికీ వీటిని ఉపాధి వనరులుగా వినియోగిస్తున్నారు. స్వామివారి దర్శనంకోసం వచ్చే భక్తులకు పరిసర ప్రాంతాల్లో పర్యటనకు ఇప్పుడు గుర్రపు బండ్లు వినోదం, విహార సాధనాలుగా మారాయి. జట్కా ప్రయాణం భక్తులకు ఉత్సాహాన్ని నింపుతోంది. యాదగిరిగుట్ట నుంచి పాతగుట్టకు ఇప్పుడు ప్రతీరోజు దాదాపు 50 గుర్రపు బండ్లు భక్తులకోసం రాకపోకలు సాగిస్తున్నాయి. ఒక్కో ట్రిప్పుకు భక్తుల నుంచి రూ.100 వసూలు చేస్తున్నారు. అయితే ఒక్కో కార్మికుడు రోజుకు రూ.300 నుంచి రూ.400 సంపాదిస్తుండగా, గుర్రం దాణా, పశుగ్రాసానికి సుమారు రూ.100 వరకు ఖర్చవుతుందని కార్మికులు పేర్కొంటున్నారు.



గుర్రాన్ని పరిశీలిస్తున్న సినీనటి, బ్లూక్రాస్ సంస్థ అధ్యక్షురాలు అక్కినేని అమల(ఫైల్)

అమల ఆధ్వర్యంలో బ్లూ క్రాస్ సేవలు

సినీనటి అక్కినేని అమల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లూక్రాస్ సొసైటీ వారు పదేళ్లగా గుర్రాలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తోంది. అంతేగాకుండా నీడకు షెడ్డులను పాతగుట్ట ఏరియాలో ఏర్పాటు చేశారు. గుర్రాలు తాగేందుకు అవసరమైన నీటితొట్టిని నిర్మించారు.



పాతగుట్టలో గుర్రాలకు నీటి కోసం ఏర్పాటు చేసిన నీటితొట్టి

ప్రభుత్వ సహాయం అవసరం

జట్కాబండి ఆధారంగా జీవిస్తున్న కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉంది. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు. జట్కాబండ్ల ఆధునీకరణకు, గుర్రాల కొనుగోలుకు, పోషణకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, నివాస గృహాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏ ప్రభుత్వమూ ఆదుకోలేదు



గత 60 ఏళ్లుగా నుంచి సేవలు అందిస్తున్న జట్కాబండ్ల కార్మికులను ఏ ప్రభుత్వం ఆదుకున్న దాఖలాల్లేవు. రాష్ట్రం ఏర్పడితే అన్ని విధాలుగా మా బతుకులు మారుతాయని కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమంలో రాజీలేని పోరాటం చేశాం. రాష్ట్రం ఏర్పడి ఇన్నేళ్లవుతున్నా బతుకులు మారలేదు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరించాలి.

గుండు అంజయ్యగౌడ్, జట్కా బండ్ల సంఘం అధ్యక్షుడు, యాదగిరిగుట్ట

జట్కాబండ్లు తగ్గిపోతున్నాయి.

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు సేవలు అందిస్తూ వారికి మా జట్కాబండ్ల ద్వారా వినోదం కలిగిస్తున్నాం. గతంలో 100 జట్కాలు ఉంటే వాటికి ఎలాంటి సహకారం లేకపోవడంతో రోజురోజుకు అంతరిస్తూ చివరకు 40కి పడిపోయాయి. ప్రపంచ ఆధ్యాత్మిక క్షేత్రంగా అభివృద్ధి చెందుతున్న యాదగిరిగుట్టలో గుర్రపుబండ్ల నిర్వాహకులకు ఉపాధి చూపాలి.

కొన్నె నర్సింహ, జట్కా బండి కార్మికుడు

నల్లమల అటవీ ప్రాంతంలో సఫారీ ట్రిప్

- ● వ్యూపాయింట్ వరకు రూ.1000, అడవిలోకి రూ.1500

నాగార్జునసాగర్, జనవరి 26: సాగర్ నల్లమల అటవీ ప్రాంతంలో ప్రకృతి ప్రేమికులు కృష్ణమ్మ సోయగాలు తిలకించేందుకు, ప్రకృతిని ఆస్వాదించేందుకు సఫారీ ట్రిప్‌ను ప్రారంభించినట్లు అటవీ శాఖ డివిజనల్ అధికారి సర్వేశ్వర్ తెలిపారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఆయన శుక్రవారం విలేకరులతో మట్లాడారు. అర్బన్ పార్క్‌లో పర్యాటకులను తిప్పేందుకు రూ.15లక్షలతో నూతనంగా సఫారీ వాహనాన్ని ఏర్పాటు చేశామన్నారు. సఫారీ వాహనంలో వ్యూపాయింట్ వరకు ఉన్న ఐదు కిలోమీటర్ల దూరం ప్రయాణించినందుకు రూ.1000, వ్యూపాయింట్ నుంచి సహజ అడవిలో మొత్తం 12 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే రూ.1500ల టికెట్ ధరలు నిర్ణయించామన్నారు. సఫారీ వాహనంలో ఎనిమిది మంది కూర్చునేందుకు వీలుంటుందని, గణతంత్ర దినోత్సవం సందర్భంగా ట్రిప్పులను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి రోజూ ఈ ట్రిప్పులు ఉదయం ఆరు గంటల నుంచి 10 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం నాలుగు గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఉంటాయన్నారు. పర్యాటకులు ప్రకృతి ప్రేమికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



నల్లమల అటవీ ప్రాంతంలోని నెల్లికల్ వ్యూ పాయింట్

ఇసుక ట్రాక్టర్‌తో ఢీకొట్టి.. తప్పించుకునే ప్రయత్నం

మోత్కూరు, జనవరి 26 : అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకోబోయిన ట్రాక్టర్‌తో కానిస్టేబుళ్ల కారును ఢీకొట్టిన ఘటన యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు డ్రైవర్‌తో పాటు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం పొడిచేడు గ్రామ సమీపంలోని మూసీ వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారు. పోలీసు వాహనంలో వెళ్లితే రవాణాదారులు తప్పించుకుంటున్నారు. దీంతో శుక్రవారం మూసీ వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తీసుకెళ్లుతున్నారన్న సమాచారంతో మోత్కూరు పోలీస్ కానిస్టేబుళ్లు ప్రైవేట్ వాహనంలో వెళ్లారు. అనాజిపురం వద్ద ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకోవడానికి ప్రయత్నించగా ట్రాక్టర్ డ్రైవర్ బండ నవీన్ ట్రాక్టర్‌తో కారును ఢీకొట్టి పారిపోయే ప్రయత్నం చేశాడు. అయినా పోలీసులు వదలకుండా చాకచక్యంగా పట్టుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. డ్రైవర్ నవీన్, ట్రాక్టర్ యజమాని నర్రె మహేష్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అవిశ్వాసం

వీగేనా.. నెగ్గేనా?

● సూర్యాపేట మునిసిపల్‌లో నేడు ఓటింగ్ ● 32 మంది కౌన్సిలర్ల మద్దతు ● అందులో సగం మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లే

సూర్యాపేట టౌన్, జనవరి 26 : సూర్యాపేట మునిసిపాలిటీ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లపై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసంపై నేడు ఓటింగ్ జరుగనుంది. చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్‌చైర్మన్ పుట్ట కిషోర్‌లపై సొంత పార్టీ బీఆర్ఎస్ కౌన్సిలర్లే తిరుగుబావుటా ఎగురవేశారు. ఇందుకు కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. మొత్తం 32 మంది కౌన్సిలర్లు కలెక్టర్ వెంకటరావుకు అందజేసిన అవిశ్వాస తీర్మాన నోటీసులో సంతకాలు చేశారు. అందులో 16 మంది బీఆర్ఎస్‌కు చెందిన వారు కావడం గమనార్హం. సరిగ్గా నాలుగేళ్ల కిందట ఇదే రోజున చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇదిలాఉండగా చైర్‌పర్సన్ అన్నపూర్ణపై అవిశ్వాస తీర్మానాన్ని నిరసిస్తూ మూడు రోజులుగా దళితసంఘాలు ఆందోళన బాటపట్టాయి.

ఉదయం 11 గంటలకు

సూర్యాపేట మునిసిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం తీర్మానంపై ఓటింగ్ నిర్వహించనున్నారు. అదేవిధంగా మధ్యాహ్నం ఒంటి గంటలకు వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసానికి సంబంధించి ఓటింగ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

చైర్‌పర్సన్ పదవి రేసులో నిఖిల?

మునిసిపాలిటీలోని 31వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిల దిలీప్‌రెడ్డి చైర్‌పర్సన్ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అసమ్మతి బీఆర్ఎస్ కౌన్సిలర్లను క్యాంపునకు ఆమె అనుచరులే తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే వైస్‌చైర్మన్ పదవి కాంగ్రెస్‌కు ఇచ్చేలా అంగీకారం కుదిరినట్లు సమాచారం

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

జిల్లాలో గణతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్, విద్యా, వ్యాపార, రాజకీయ పార్టీ కార్యాలయాలల్లో జాతీయ జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా జాతీయ నాయకుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి స్వీట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

● ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్


కోదాడలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి


సూర్యాపేటలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్


పెన్‌పహాడ్ జడ్పీహైస్కూల్‌లో భారతమాత, జవహర్‌లాల్ నెహ్రూ, తెలంగాణ తల్లి వేషధారణలో బాలికలు


పెన్‌పహాడ్ మండలం అనంతారం హైస్కూల్‌లో బహుమతులు అందజేస్తున్న దాత శ్రావ్య


తుంగతుర్తి కోర్టుల ఆవరణలో జెండా ఆవిష్కరిస్తున్న జడ్జి ప్రశాంతి


జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, జడ్పీ సీఈవో జి.సురేష్


హుజూర్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి


అర్వపల్లిలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సుయాదవ్


పోటీల్లో బహుమతులు గెలుచుకున్న సూర్యాపేట త్రివేణి పాఠశాల విద్యార్థులు


ప్రశంసాపత్రాలతో నడిగూడెం మండలంలోని సిరిపురం పాఠశాల విద్యార్థినీవిద్యార్థులు


ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్ల పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వైస్ ఎంపీపీ వెంకన్న

ఉత్తమ అవార్డులు అందుకుంది వీరే..


కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న సూర్యాపేట అదనపు ఎస్పీ ఎం.నాగేశ్వర్‌రావు


సురేష్‌కుమార్, జడ్పీ సీఈవో | రాంపతి, సివిల్ సప్లయ్ మేనేజర్ | శంకర్, జిల్లా గిరి జన సంక్షేమాధికారి | వెంకటేశ్వర్లు, సీపీవో | రమేష్‌కుమార్, డీపీఆర్వో | డాక్టర్ శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి | కొంపెల్లి లింగయ్య, పీపీ సూర్యాపేట | కాకి రాంరెడ్డి, పీపీ సూర్యాపేట | జి.రాజశేఖర్, సూర్యాపేట పట్టణ సీఐ | బాల్నె కుశలవ ఎస్ఐ, సూర్యాపేట


ఎం.వీరయ్య, ఎస్ఐ స్పెషల్ బ్రాంచ్ | అవిలయ్య, ఎస్ఐ డీసీఆర్‌బీ | జగన్మోహన్‌రెడ్డి ఎస్ఐ, ఆపరేషన్ | సాయిరాం, ఎస్ఐ సూర్యాపేటరూరల్ | సీహెచ్ శ్రీనివాస్ హెడ్‌కానిస్టేబుల్ సీసీఎస్ సూర్యాపేట | అనిత, ఈఎస్ సూర్యాపేట | రూపేందర్‌సింగ్ జిల్లా మత్స్యశాఖాధికారి | శ్రీధర్ డీసీవో | నవీన్‌కుమార్, ఎస్ఐ సూర్యాపేట ట్రాఫిక్ | మురళీధర్‌రెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ | నరేష్, కేవీకే శాస్త్రవేత్త | రవికుమార్, డీటీవో | మల్లేషం, ఐఅండ్‌పీ ఆర్ ఈఈ


గఫార్‌అహ్మద్ ఈ-జిల్లా మేనేజర్ | సతీష్‌కుమార్ డీఎఫ్‌వో | జ్యోతి పద్మ, జిల్లా సంక్షేమాధికారి | నాగేందర్, జిల్లా సర్వే ల్యాండ్ అధికారి | మోహన్‌బాబు డీఎస్‌వో | జాహంగీర్, ఎస్ఐ సీసీఎస్ సూర్యాపేట | రువ్వ కనకరత్నం ఎస్ఐ | గునగంటి వెంకన్న ఏఎస్ఐ, చివ్వెంల | మూసీ వెంకయ్య ఏఎస్ఐ డీసీఆర్‌బీ | ఒగ్గు వెంకన్న, ఏఎస్ఐ సూర్యాపేట రూరల్ | శ్రీనయ్య ఏఆర్ ఏఎస్ఐ సూర్యాపేట | సూర్యాపేటలో సమతా సేవాదళ్ ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ నాగభూషణం

కార్యకర్తలకు అండగా ఉంటా

హుజూర్‌నగర్, జనవరి 26: బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో ఆయన జాతీయ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యకర్తలు అధైర్యపడొద్దని, ఆపదలో ఉన్న వారిని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని పంట పొలాలకు నీటిని విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో అమర్‌నాథ్‌రెడ్డి, ఫణికుమారి, జక్కుల నాగేశ్వరరావు, అమర్‌గౌడ్, కొప్పుల సైదిరెడ్డి, కెఎల్ఎన్‌రెడ్డి, మంగమ్మ, భూక్యా చంద్రమౌళినాయక్ పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్ పట్టణంలోని కనకదుర్గాదేవి ఆలయంలో దుర్గామాతను శాకంబరిదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అమర్‌నాథ్‌రెడ్డి, వీరయ్య, సైదిరెడ్డి, వెంకటరెడ్డి, అమర్ గౌడ్, ఫణికుమారి, సరస్వతి, రాజ్యలక్ష్మి, ఫణి తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక చిన్న దర్గా ఉర్సు


గంధాన్ని తీసుకెళ్తున్న ధర్మకర్త శ్రీకాంత్‌రెడ్డి, హబీబ్

అర్వపల్లి, జనవరి 26: మతసామరస్యానికి ప్రతీక చిన్న దర్గా ఉర్సు అని ధర్మకర్త వెన్న శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. అర్వపల్లి -జాజిరెడ్డిగూడెం గుట్టల మధ్య ఉన్న సయ్యద్‌జాన్‌పాడ్ షాహిద్ సయ్యద్ ఖాజా మోహినోద్దీన్ బాబా చిన్న దర్గా ఉర్సును శుక్రవారం వైభవంగా నిర్వహించారు. దర్గా వద్ద గంధాన్ని భక్తుల నడుమ ఊరేగించారు. దర్గా చుట్టూ ప్రదక్షిణలు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు గంధం కోసం పోటీపడ్డారు. గంధాన్ని బాబాకు సమర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దర్గా ముజవర్ హబీబ్, మధుకర్‌రెడ్డి, జాని, సాయి, నిఖిల్‌రెడ్డి, రబ్బాని, బషీర్, రెహ్మత్, అక్బర్ పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా మహబూబ జాతర


గంధాన్ని తీసుకువస్తున్న భక్తులు

పెన్‌పహాడ్, జనవరి 26: మండలంలోని దూపహాడ్ గ్రామంలో మహబూబ ఉర్సు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. జాన్‌పహాడ్ దర్గా నుంచి తీసుకువచ్చిన గంధాన్ని దూపహాడ్ గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తూ దర్గా వద్దకు చేరుకున్నారు. అక్కడ గంధం తీసుకోవడానికి భక్తులు పోటీపడ్డారు. కోరిన కోర్కెలు తీర్చే మహబూబ దర్గా వద్దకు వచ్చి భక్తులు మొక్కులు చెల్లించారు. జాతరలో భక్తులు వంటలు చేసుకుని బంధువులతో సంతోషంగా గడిపారు. జాతరకు వచ్చిన భక్తులకు సౌకర్యాలను మహబూబ జాతర కమిటీ నిర్వాహకులు గోపగాని వెంకటేశ్వర్లు, లక్ష్మమ్మ ఏర్పాటు చేశారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయం

కోదాడ రూరల్, జనవరి 26: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మికులు ఐక్యమై గద్దె దించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు కోరారు. శుక్రవారం పట్టణంలో సీఐటీయూ, తెలంగాణ రైతుసంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కమిటీల ఆధ్వర్యంలో ట్రాక్టర్స్, ఆటో, మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక వ్యతిరేక విధానాలతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించిందని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలను అమలు చేయకుండా కార్మికులను మోసం చేసిందని ఆయన విమర్శించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు మిట్టగణుపుల ముత్యాలు అధ్యక్షతన జరిగిన ఈ సభలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు దేవరం వెంకటరెడ్డి, బెల్లంకొండ సత్యనారాయణ, చందా చంద్రయ్య, షేక్ సైదా, వేనేపల్లి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు సోమపంగు జానయ్య, ఆరె రామకృష్ణారెడ్డి, రాపోలు సూర్యనారాయణ, నాగటి చిన రాములు, జంపాల స్వరాజ్యం, సీఐటీయూ జిల్లా నాయకుడు బచ్చలకూర స్వరాజ్యం, బొమ్మగాని వెంకటేష్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాసాని కిషోర్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు గడ్డం వినోద్, వెలుగు మధు, చెగువేరా, తుమ్మ సతీష్, జూలకంటి కొండారెడ్డి పాల్గొన్నారు.


కోదాడలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ, రైతు సంఘం నాయకులు

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తాం

మఠంపల్లి, జనవరి 26: సాగర్ సిమెంట్స్ పరిశ్రమ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని పరిశ్రమ హెడ్ ఆఫీస్ సీనియర్ అధికారి మోహన్‌రెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎంవీ రమణమూర్తి అన్నారు. శుక్రవారం మఠంపల్లి మండల కేంద్ర సమీపంలో ఉన్న సాగర్ సిమెంట్స్ పరిశ్రమ 43వ వార్షికోత్సవం నిర్వహించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయజెండాను ఆవిష్కరించి మాట్లాడారు. పరిశ్రమ చుట్టుపక్కల గ్రామాలను ఎంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. అనంతరం పరిశ్రమ వ్యవస్థాపకుడు సమ్మిడి వీరారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ వి.సుబ్రహ్మణ్యం, డీజీఎం హెచ్‌ఆర్ హరిదాసు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

లెక్చరర్ల సంఘం జిల్లా నేతగా శ్రీనివాస్

నడిగూడెం, జనవరి 26: తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నడిగూడెం కాలేజి రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ కొల్లు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. శుక్రవారం నల్గొండలోని కోమిటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ కళాశాలలో ఉమ్మడి నల్గొండ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనక చంద్రం, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహ, కొండల్, జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన ఏఎస్ఐ

సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 26: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఓ ఏఎస్ఐ అస్వస్థతకు గురయ్యారు. కోదాడ స్పెషల్ బ్రాంచ్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు కలెక్టర్, ఎస్పీ ప్రశంసాపత్రం అందశారు. అనంతరం గణతంత్ర వేడుకలు ముగిసే సమయంలో ఒక్కసారిగా లోబీపీతో సొమ్మసిల్లి పడిపోయారు. తోటి ఉద్యోగులు గమనించి వైద్యాధికారులకు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆరోగ్య శాఖ స్టాల్ వద్ద డీఎంహెచ్‌వో కోటా చలం ఆధ్వర్యంలో పలువురు వైద్యులు హనుమకు బీపీ, షుగర్‌ను పరిశీలించి ప్రాణాపాయం లేదని నిర్ధారించారు. అనంతరం అంబులెన్స్‌లో మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం

సూర్యాపేట(కలెక్టరేట్): జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలయ్యేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్. ప్రియాంక అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు.

హుజూర్‌నగర్: మోదీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని అవమానిస్తోం దని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, సాముల శివారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరు జ్‌కుమార్ ఆరోపించారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో అజీజ్‌పాషా, కుంట సైదులు, దయాకర్, గురవయ్య, యోహాన్, వెంకన్న, శివరామ్‌యాదవ్, మన్సూర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

● మతోన్మాదుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలని సీపీఐ జిల్లా స్టేట్ కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అయోధ్య రామమందిరాన్ని భక్తి పేరుతో బీజేపీ రాజకీయం చేసిందన్నారు. సమావేశంలో మల్లేశ్వరి, రమేష్, విజయ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: ఆరోగ్యం పట్ల ప్రజలు శ్రద్ధవహించాలని సర్పంచ్ శిరీషకొండారెడ్డి కోరారు. మండలంలోని వేపలసింగారంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగమణి, వాజిద్, ప్రశాంత్, కార్తీక్, సతీష్, భాస్కర్‌రెడ్డి, సారెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం నృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

నడిగూడెం: కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై నిరుద్యోగులు, యువకులు బీజేపీలో చేరుతున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నడిగూడెంకు చెందిన చిలక బాలకృష్ణతో పాటు మరికొందరు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో లతీఫ్, నాగరాజు, శోభరాణి, గురవయ్య, వర్మ పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని గుడిబండ గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సైన్స్ ల్యాబ్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులో మేథాశక్తిని పెంపొందించేందుకు సైన్స్ ఎంతో దోహదపడుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లంకెల అలివేలు మంగమ్మ, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

● భారత జాతీయ సముద్ర సమాచార సేవల కేంద్రం (ఐఎన్‌సీఓఐఎస్) రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో మండలంలోని కొమరబండ తేజ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి తెలిపారు. ఫైనల్స్‌లో 8వ తరగతి విద్యార్థులు, సృజన్, సునందు, శాశ్వత్‌లు తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు.

మోతె: ఎడ్యుకేషన్ టూర్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్ర శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల, రాజేంద్రనగర్ విద్యార్థులకు మండలంలోని మామిళ్లగూడెంలో వ్యవసాయ రంగంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. జామ, కొబ్బరి, నారు పెంపకం తదితర అంశాలపై క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్, అధ్యాపకులు మమత, ఏఈవో శ్రీకాంత్ పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్: మండలంలోని తొండ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు కందుకూరి చంద్రమ్మ, నర్సయ్యల జ్ఞాపకార్థం వారి కుమారుడు లక్ష్మయ్య సహకారంతో లైయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 100మంది విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మంద పద్మారెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి కందుకూరి లక్ష్మయ్య, కోశాధికారి జి.సురేష్, సభ్యులు పాల్గొన్నారు.

నాగారం: మండలంలోని పేరబోయినగూడెం ప్రాథమిక పాఠశాలకు రూ.20 వేల విలువైన గేటును, రూ.5 వేల విలువైన సింగిల్ ఫేజ్ మోటారును అదూ గ్రామానికి చెందిన దొడ్డి ప్రేమయ్య అందజేశారు. ప్రేమయ్య-లక్ష్మి దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ తీగుళ్ల స్వరూప ప్రశాంత్, ఉప సర్పంచ్ కడారి సత్తయ్య, వార్డు మెంబర్‌లు మద్దురి బిక్షం, కంచుగట్ల లింగయ్య, పంచాయతీ కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం: మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ నూతన భవన ప్రారంభ కార్యక్రమానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఉదయం 10 గంటలకు వస్తారని ఎంపీడీవో గాలి శోభరాణి తెలిపారు.

మద్దిరాల: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రొఫెసర్ కోదండరాంను ఎంపిక చేయడంపై కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు వల్లపు రమేష్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మద్దిరాల మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. సమావేశంలో నాయకులు మమూనూరి ఉపేందర్‌గౌడ్, భూతం చలం, శంభయ్యనాయుడు, శ్రీను, లింగయ్య పాల్గొన్నారు.

తుంగతుర్తి: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు వర్దెల్లు రాములు మృతి సీపీఎంకు తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. మండలంలోని కరివిరాల, కొత్తగూడెం గ్రామాల్లో నిర్వహించిన రాములు అంతిమ యాత్రలో పాల్గొని మాట్లాడారు. తుంగతుర్తి పరిసర ప్రాంతాల్లో భూమి, భుక్తి కోసం రాములు పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నెమ్మది వెంకటేశ్వర్లు, కోలిశెట్టి యాదగిరిరావు, బుర్ర శ్రీనివాస్, పులుసు సత్యం, శంకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మట్టిపల్లి శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుమలప్రగడ కిషన్‌రావు, సీపీఎం నాయకులు పల్లా సుదర్శన్, తాటి విజయమ్మ, సర్పంచ్ నకిరకంటి విజయ్ పాల్గొన్నారు.